# ప్రోలోగ్

"టు ఎర్ ఈజ్ హ్యూమన్" అన్నారు.

ఎవరూ! హ్యూమన్సు!

"టు ఫర్‌గివ్ ఈజ్ డివైన్" అన్నారు.

ఎవరూ? అదీ హ్యూమన్సే!!

క్షమించేవాడుండాలే కాని తప్పులక్కొదవా? అయితే మనం దేవుడు కూడా క్షమించలేని తప్పులు చేస్తాం.

టు ఎర్ ఈజ్ హ్యూమన్

ఐ యామ్ హ్యూమన్

సో నేనూ తప్పు చేశేను.

దాన్ని లాజిక్‌లో ఇండక్షనో, డిడక్షనో అంటారు.

అసలు సంగతి –

1965లో అనుకుంటాను. అనుకోవడమేమిటి? అప్పుడే. మొగుడు, పిల్లలు హాయిగా సంసారం చేసుకోక ఓ దుర్ముహూర్తాన ఓ కథ రాశేను. రాసిన దాన్ని ఊరుకున్నానా? ఊరుకుంటే కథే లేదు. నెత్తిమీద శని తాండవం చేస్తూ ఉంటే ఎలా ఊరుకుంటాను? మా వారికి చూపించేను.

నా మొగుడని చెప్పడం కాదు కాని – ఆయన పరమ గడుసు పిండం.

కథ చదివేరు.

కాగితాలు టేబిలు మీద పెట్టి, సిగరెట్ అంటించి అలా నా మొహంలోకి చూశేరు. చెప్పొద్దూ – నాకు గుండె గొంతుకలో కొట్టుకుంటోంది.

బావుంది.

బాలేదు.

నా మొహానికి కథ కూడానా?

ఏదో ఒకటి అనాలికదా? అన్లేదు.

మర్డర్ కేసులో ఆర్గ్యుమెంటు అయిపోయేక పద్నాలుగు రోజుల్లో జడ్జిమెంటు చెప్పాలి.

నా కథ మర్డర్ కేసా?

జడ్జిమెంటుకి పధ్నాలుగు రోజులు ఆగాలా?

ముద్దాయిని పోలీసులు పట్టుకుపోతారు.

నేను నా కాగితాలు తీసుకొని పారిపోయేను. మర్నాడంతా ఆయన్ని తప్పించుకునే తిరిగేను. ఇక్కడితో కథ అయిందా? అవలేదు. ఇప్పుడే మొదలైంది.

మర్నాడు సాయంత్రం –

కోర్టునుండి వస్తూనే సరాసరి వంటింట్లోకి వచ్చి నాచేతిలో కొన్ని కాగితాలు పెట్టి "ఆ పని ఆపి ఇది చదువు" అన్నారు.

కొంపతీసి జడ్జిమెంటు కాదుకదా!

యావజ్జీవవా? కాదా?

గుండె గొంతుకలో కూడా లేదు.

కుర్చీలో కూలబడి చదివేను.

కథ బావుంది. బ్రహ్మాండంగా ఉంది.

ఏవిటీ! ఈ రావణాసురుడికి కథ వ్రాయడం కూడా వచ్చా?!

"మంచి గమ్మత్తు చేద్దావేవిటే అమ్మడూ"

తమకి అద్దేవిటి మహాశయా?

"నువ్వ్రారాయి. నేనూ రాస్తాను. పేరు మాత్రం జాయింట్‌గా "భీనాదేవి" అని పెడదాం."

అలా పుట్టింది
"భీనాదేవి."

కొత్త బిచ్చగాళ్ళలా కొన్నేళ్ళు తెగరాసేం. ఆశ్చర్యం! అన్నీ ప్రింటయ్యేయి.

ఆ రోజుల్లో ఎన్ని డిస్కషన్స్!

ఎన్ని దెబ్బలాటలు!

ఎన్ని ఆలోచనలు!!

అహం, పట్టుదల ఇద్దరికీ.

అతనికి జీన్స్‌లో

నాకు మేనమావ పోలిక.

అతనే రాస్తాడు. ఆవిడ ఫెయిర్ చేస్తుంది.

నవ్వేం.

ఆఫ్టరాల్ ఒక ఆడది అంత పవర్‌ఫుల్‌గా రాయటవా? నమ్మలేం.

నమ్మకండి సార్.

ప్రపంచంలో జరిగే ఏ సంఘటనకీ మన నమ్మకాలతో సంబంధం ఉండదు మరి.

"గాన్ విత్ ది విండ్" రాసిన మార్గరెట్ మిచెల్ మొగాడా?

ఆ! వాళ్ళకీ, మనకీ పోలికా?

ఆడవాళ్ళ సంగతి నాకు తెలీదు కాని మొగాళ్ళకి మాత్రం పోలిక లేదు.

ఏదేమైనా అలా పుట్టిన బీనాదేవిని 1990 సెప్టెంబరు 5న పత్రికలవాళ్ళు చంపేశేరు.

బీనాదేవి సంతాప సభ.

స్మారక సభ.

బీనాదేవి రైటప్స్.

మావారు నన్ను తనతో శారీరకంగా తీసుకెళ్ళలేకపోయినా, తన పేరుతో సగమైన "దేవి"ని కూడా తీసికెళ్ళిపోయేరు.

థేంక్యూ సర్.

థేంక్యూ వెరీమచ్.

సో. బీనాదేవి చచ్చిపోయింది. (పోయేదు)

పాపం. పత్రికల వాళ్ళు అంత అభిమానంగా చంపిన బీనాదేవిని నేనెందుకు బతికించడం?

ఊరుకున్నాను.

"అసలు మీకేమైనా బుద్ధుందా? నరసింగరావుగారు పోయేరు. కాని బీనాదేవి కాదు. రాయండి" అని నన్నూ "మీ అమ్మ చేత రాయించకపోతే ఊరుకోను" అని మా అమ్మాయినీ జెమిలిగాను, విడివిడిగానూ ధన ధనలాడించేశేరు ధన్‌గారు.

అందుకే రాద్దావనిపిస్తోంది.

కాని...కాని...ఎవరితో డిస్కస్ చేయను? ఎవరిస్తారు మంచి సలహాలు?

నేను పోగొట్టుకున్నది పసుపు, కుంకం, గాజు-పూస ఈ ట్రాష్ కాదు.

ఒక మంచి గైడ్‌ని.

ఒక గొప్ప ఎడ్వైజర్‌ని.

ఒక తోడుని, ఒక నీడని.

ప్రపంచంలో అన్నిటికంటె భయంకరమైనది దరిద్రంట.

మానసిక ఒంటరితనం – దట్ మెంటల్ లోన్లినెస్ – దరిద్రం కంటె భయంకరమైనది.

అందుకే – ఆ ఒంటరితనాన్ని జయించడానికైనా రాద్దావనుకుంటున్నాను.

నర్సింగరావ్!

మొదట నీ ఎలిజీతోనే ప్రారంభిస్తున్నాను. ఇటుపైన రాసేవన్నీ నీకే అంకితం.

★ ★ ★

ఇది ఆత్మస్తుతి కాదు. పరనిందా కాదు.

నా మొగుడి గొప్పతనం చాటడం అంతకంటె కాదు. ఉన్న గొప్పపోదు. లేనిది రాదు.

ఈ జన్మలో దేవుడ్ని నమ్మకపోయినా –

గత జన్మలో ఏ దేవుడికి వాడిన పువ్వులు పూజ చేశేనో.

ఏ దేవతకి నిప్పుల నైవేద్యం పెట్టేనో,

ఈ బతుకు ఎడారిలో కన్నీరు కరువై ఒంటరితనమే తోడుగా, మంచితనమే నీడగా, ఆగని బతుకు లాగలేక, లాగలేని జీవితం ఆపలేక, నేను చేసే ఆక్రందన, వేసే పెనుకేక.

★ ★ ★

గత అనుభవాల అనుభూతులు పెను భూతాలై కరాళ నృత్యం చేస్తున్నాయి.

మనసులో జ్ఞాపకాల చితులు రగులుతూనే ఉన్నాయి. నన్ను నిలువునా దహించేస్తూనే ఉన్నాయి.

నరసింగరావు పోయి ఎన్ని యుగాలైంది! గంటలు రోజులు–రోజులు నెలలు–నెలలు సంవత్సరాలౌతున్నాయి. నా జీవితంలో కేలండరు 1990 సెప్టెంబరు 5వ తేదీతో ఆఖరైపోయింది.

నా బతుకు గడియారం ఆరోజు సాయంత్రం 7 గం. దగ్గర ఆగిపోయింది.

ప్రతి రాత్రి "భగవాన్! మృత్యువు ఒక రోజు ముందుకు జరిగింది" అన్న నిట్టూర్పు.

మనుషుల మంచితనంలో నమ్మకం పోయింది.

"There is only one christian. And he died on the cross" అన్నాడు "షా".

"There is only one good man. And He died on Sep. 5th 1990" అనుకున్నాన్నేను.

ఎప్పుడూ ఏదో అశాంతి, అల్లకల్లోలం, నిరాశ నిస్పృహ.

అదిగో ఆ పరిస్థితుల్లో –

"మీ ఎంక్వైరీ తొందరగా పూర్తిచేసి రిపోర్టు పంపిస్తే మేము యాక్షన్ తీసుకుంటాం" కర్నూలు ఎస్.పి.గారి మహజరు. మండే ఇనపచక్రాల పళ్ళమధ్య మనసు భగ్గుమంది.

కళ్ళల్లో కావేరి కాలువలు కట్టింది.

ఈ కన్నీళ్ళే ఉప్పెనలై ఈ దిక్కుమాలిన ప్రభుత్వాల్ని ముంచేస్తే?

ఈ గుండెల మంట దావానలమై పనికిమాలిన ప్రభుత్వాల్ని బూడిద చేసేస్తే?

నరసింగరావ్!

ఒక దుర్ముహూర్తాన నువ్వొచ్చి "లాకప్ డెత్ ఎంక్వైరీ" ఒప్పుకున్నానని చెప్పేవు గుర్తుందా?

"ఈ కమీషన్లు మనకొద్దు. నీలాంటి సిన్సియర్ ఆఫీసర్లు వాళ్ళకి ఒద్దు. హాయిగా పిల్లలతో ఆడుకో" బతిమాలేనా.

ఛా! పెళ్లాం మాట వినడం మనవంశంలోనే లేదు. చేసేక చెప్పడమే కాని చెప్పి చేసే అలవాటు లేదు.

నువ్వు గాంధీగారి శిష్యుడివి.

గౌతమ బుద్ధుడి వారసుడివి.

పాము కప్పని పట్టినట్టు, నువ్వు న్యాయం రక్కున పట్టేస్తానని నీకో పిసరు గర్వం.

నరసింగరావంత గొప్పవాడు లేడనిపించుకోవాలని నీకో చిన్న కోరిక.

ఎక్కడుంది న్యాయం?

కోర్టుల్లోనా? ఛా! ఛా!! ఆ మాట కోర్టువారు కూడా అనరు.

గవర్నమెంటు ఆఫీసుల్లోనా? ఎంత మాటా!

ఎక్కడా లేని దాన్ని నువ్వు మాత్రం ఎలా తేగలవు?

"నిజం చాలా అరుదైనది. అంచేత దాన్ని పొదుపుగా వాడుకో" మన్నాడు మార్క్ ట్వైన్. గుర్తులేదా?

ఆ మాట న్యాయానిక్కూడా వర్తిస్తుందేమో.

నీ ఒక్కడి మీదే ఈ ప్రపంచం నడుస్తోందా? ఇన్నేళ్లు జడ్జీగిరీ వెలగబెట్టేవు – ఆమాత్రం తెలీదా? ఈ కమీషన్లు, ఎంక్వైరీలు ఏవిటో తెలుసా? ప్రజల కన్నీళ్లు తుడిచే కర్చీఫులు. అపొజిషన్ గోల ఆపే గారడీలు.

ఏ ఎంక్వైరీ వల్లనైనా నిజం బైటపడి, నిందితుడికి శిక్ష, హతుడికి న్యాయం జరిగిన దాఖలాలున్నాయా?

(ఒకటి, అరా ఉంటే నా అజ్ఞానానికి క్షంతవ్యురాల్ని.)

లాకప్ డెత్ అంటే మామూలు భాషలో మర్డర్. అనుమానితుడు

పోలీసు. ఔనా? పట్టపగలు పబ్లిక్ రోడ్డుమీద పదిమంది కార్లతో వచ్చి అందరూ చూస్తూ ఉండగా ఒక మనిషిని కూర తరిగినట్లు తరిగేస్తే కేసుగాని, సాక్ష్యంగాని ఉంటుందా?

మరింక ఈ లాకప్‌డెత్ ఒక లెఖ్ఖా!

దీనికి సాక్ష్యం చెప్పేది, చెప్పగలిగేది ఇద్దరే.

ఒకరు దేవుడు. రెండు చచ్చినవాడు.

ఒకడు చెప్పడు. రెండోవాడు చెప్పలేడు.

ఈ మాత్రానికి వీటికి కమీషన్లు, జడ్జీలకి నెలలు (కొండొకచో ఏళ్ళు) తరబడి జీతాలు, స్టెనో, స్టాఫ్, మందీ మార్బలం వగైరా వగైరా. వీటన్నిటికీ అయ్యే ఖర్చు ఆ చచ్చిన వాడి తల్లికో, పెళ్ళానికో (పాపం శమిస్తే ముండకో) ఇస్తే వాళ్ళు ఆ చచ్చినవాడి పేరు చెప్పుకొని సుఖపడతారు.

ఇవన్నీ రండా గర్భాలు.

ఉంచుకోలేరు. తీసెయ్యలేరు.

పాతికో, పరకో పడేస్తారని ప్రలోభ పెట్టేవు. మనకి డబ్బెందుకు సార్? మన పిల్లలే మన ఆస్తి. ఎన్నడూ లేని డబ్బు తాపత్రయం ఇప్పుడెందుకు మాస్టారూ ఒద్దుసార్. మనిషి కాటుకైనా మందుందేమో కాని డబ్బు కాటుకి మందులేదు.

నా మొర విన్నారా?

దేవుడు భక్తుల మొర వింటాట్ట.

పతిదేవుడు మాత్రం పెళ్ళాం మొర వినడు.

సరే. ఒప్పుకున్నారు. బాగానే ఉంది.

అందరిలాగా గుమాస్తాల్ని, స్టెనోని వేసుకున్నావా? అమ్మో! గవర్నమెంటు డబ్బుని ఎందుకు దుబారా చెయ్యడం? మీ వెర్రిగాని ఈ కమిషను మాత్రం దండుగ కాదా? ఆల్ ఇన్ వన్ అయి అన్నీ నువ్వే చేశేవు.

సిగరెట్లు నిత్యాగ్నిహోత్రం అయేయి.

కాఫీ గంగానదై ప్రవహించింది.

ఆ అగ్నిలో నువ్వు ఆహుతై పోయేవు.

ఆ నదిలో నువ్వు కొట్టుకొని పోయేవు.

హార్ట్ ఫెయిల్యూర్ వచ్చింది.

"చూడండి. ఈ గుండె జబ్బు వల్ల ఈ ఎంక్వైరీ పూర్తి చెయ్యలేనని రాసేయండి" అల్లుళ్ళు సలహా ఇచ్చేరు.

"కనీసం ఇంకో రెండు మూడు నెలలు టైము అడగండి. జీతం ఒద్దు. గుండెకి ఇంత లోడ్ మంచిదికాదు". వినవని తెలిసీ బతిమాలేను.

"చూడూ. నా గుండె చాలా గట్టిది. ఈ సిగరెట్లు, కాఫీలు నన్నేం చెయ్యవు. ఇన్ని సిగరెట్లు కాల్చిన నేను నాలుగు హార్ట్ ఎటాక్‌లు తట్టుకున్నాను. సిగరెట్ వాసన కూడా పడని మీ బాబు మొదటిసారే హరీ మన్నాడు" అని నా నోరు మూసేసేవు.

అగష్టు 31న స్వయంగా తీసికెళ్ళి గవర్నమెంటుకి ఇచ్చేశేవు కదూ. మరి సంవత్సరంన్నర తర్వాత "నీ రిపోర్టేదీ" అంటారేవిటి?

చూశేవా! నరసింగరావ్!!

నువ్వు నీ ప్రాణాలను సైతం ఒడ్డి చేసిన ఎంక్వైరీ ఇంతవరకు చేరవలసిన చోటుకి చేరలేదు. నువ్వు ఆశించిన న్యాయం జరగనే లేదు.

ఇన్నాళ్ళు "జాతస్యహి ధృవం మృత్యుర్ధువం" అని నన్ను నేనే ఓదార్చుకున్నాను.

కాని... ఇప్పుడే ఎస్.పి. గారి ఉత్తరం చదివేక గుండె అగ్నిపర్వతం అయిపోయింది. "లాకప్ డెత్" ఆ చచ్చిన వాడిది కాదు. నీది. You are locked up to death. వాడెవడో గాని ద్విపాద నక్షత్రాన చచ్చినట్టున్నాడు. పోతూ పోతూ నిన్ను కూడా తీసికెళ్ళిపోయేడు.

ఆత్మలే గనక నిజమై,

మీరిద్దరూ కలుసుకుంటే!

అడుగుతావుకదూ నీ రిపోర్టు రైటో తప్పో!

ఆఖర్న మీరిద్దరూ జెమిలిగా నాకోసం రెండు కన్నీటి చుక్కలు రాల్చుతారు కదూ!

★ ★ ★